నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 7 సెప్టెంబర్ 2024 | SURYAPET

విఘ్నేశ్వరాయ నమః

నేడు వినాయక చవితి

- విగ్రహాల ప్రతిష్ఠకు వాడవాడలా ముస్తాబైన మండపాలు
- పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేటలో గణనాథుడిని తీసుకొస్తున్న భక్తులు

రామగిరి/బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 6 : తొలి పూజలందుకునే వినాయకుడి పండుగ వచ్చేసింది. నవ రాత్రోత్సవాల సంబురాలు తెచ్చింది. నేడు వినాయక చవితి సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసి లంబోధరుడి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. మార్కెట్లలో గణేశ్ విగ్రహాల అమ్మకాలు జోరుగా సాగాయి. పూజకు కావాల్సిన పూలు, పండ్లు ఇతర సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. పర్యావరణ పరిరక్షణ నిమిత్తం మట్టి గణపతి విగ్రహాలకే జనం మొగ్గు చూపుతున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశాయి. నేటి నుంచి ప్రత్యేక పూజలు, భక్తిపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామాలు, పట్టణాలు కోలాహలంగా మారనున్నాయి. జిల్లా ప్రజలకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలు తొలగి వెలుగులు నిండాలని, ప్రకృతి కరుణించి, మహా గణపతి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

వరద తెచ్చిన నష్టం

చిలుకూరు, వర్షం నారాయణపురంలో దెబ్బతిన్న పంట పొలాలు

చిలుకూరు : చిలుకూరు మండలంలో భారీ వర్షం నష్టాన్ని మిగిల్చింది. వాగుల వరద పోటెత్తడంతో చిలుకూరు, నారాయణపురంలోని చెరువుకట్టలు తెగి పంట పొలాలు పూర్తిగా ఇసుకమేటలు వేశాయి. వరి పైరు కొట్టుకొని పోయి పొలాల్లో రాళ్లు దర్శనమిస్తున్నాయి. వంద ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఆరుగాలం కష్టపడి నాట్లు వేసిన 20 రోజులకే పంట మాయం అవ్వడంతో రైతుల బాధ వర్ణనాతీతం. గత సంవత్సరం వర్షాలు లేక పంటలు ఎండిపోగా ఈ సారి అధిక వర్షాలతో నీట మునగడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. నారాయణపరం చెరువు మూడు చోట్ల తెగడంతో వరద ఉధృతికి ఇండ్లలోకి నీరు చేరింది. నారాయణపరం, పాలెం అన్నారం గ్రామాల్లోని ఇండ్లల్లో సామాన్లు తడిసి ముద్దయ్యాయి. దాంతో ప్రజలు ఆరుబయట తలదాచుకుంటున్న పరిస్థితి నెలకొంది. పాలెఅన్నారం, నారాయణపురంలో నిరాశ్రయులైన వారికి దాతలు భోజన వసతితోపాటు నిత్యావసర సరుకులు అందిస్తూ మానవత్వం చాటుతున్నారు. ఇండ్లు కోల్పోయిన వారికి, పొలాలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చిలుకూరు : నారాయణపురంలో చెరువుకట్ట తెగడంతో పూర్తిగా ఇసుక మేటలు వేసిన పొలాలు

విరిగిన స్తంభాలు.. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు

నేరేడుచర్ల : శని, ఆదివారం కురిసిన భారీ వర్షాలకు కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో అపార నష్టాన్ని మిగిల్చింది. రోడ్లు, పంటలు, చెరువులు, కుంటలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. ఇప్పుడప్పుడే వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆయా శాఖల అధికారులు నష్టం అంచనాను మొదలు పెట్టారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 7 మండలాల్లో సుమారు రూ. 70 లక్షల మేర విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లినట్ల అధికారులు అంచన వేశారు. హుజూర్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని 5 మండలాల్లో రూ. 58 లక్షలు, కోదాడ సబ్ డివిజన్ పరిధిలోని చింతలపాలెం, మేళ్లచెర్వు మండలాల్లో సుమారు రూ. 12 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. అత్యధికంగా హుజూర్‌నగర్, మఠంపల్లి గరిడేపల్లి, పాలకవీడు మండలాల్లో విద్యుత్ వ్యవస్థ బాగా దెబ్బతినగా చింతలపాలెం, మేళ్లచెర్వు, నేరేడుచర్ల మండలాల్లో స్వల్పంగా ఉన్నది. నియోజకవర్గ వ్యాప్తంగా 834 విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా 59 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. సుమారు 50 కిలోమీటర్లకు సరిపడా విద్యుత్ వైర్లు తెగిపోయాయి. స్తంభాలు విరిగినా, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా ప్రజలకు ఇబ్బంది లేకుండా వెంటనే తమ సిబ్బంది విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పునరుద్ధరించారని హుజూర్‌నగర్ విద్యుత్ శాఖ ఏడీఈ సక్రునాయక్ తెలిపారు.

మఠంపల్లి మండలంలోని కిందితండా, మచ్చతండాకు వెళ్లే మార్గమధ్యంలో విరిగిపడిన విద్యుత్ స్తంభం

కోతకు గురైన రోడ్లు

నూతనకల్ : మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. మాచనపల్లి, లింగంపల్లి, మిర్యాల, అల్గునూరు గ్రామాలకు రాకపోకలు నిలిచి ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కోతకు గురైన మాచనపల్లి నుంచి నూతనకల్‌కు వెళ్లే రోడ్డు

భారీ వర్షంతో దెబ్బ తిన్న గంటవారిగూడెం రోడ్డు

నేరేడుచర్ల : రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి నేరేడుచర్ల మండలంలోని గంటవారిగూడెం నుంచి నేరేడుచర్లకు వచ్చే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. కాల్వపై సిమ్మెంట్ గూనలు వేసి మట్టిపోసి రోడ్డు వేయడంతో వర్షం వచ్చిన సమయంలో చెత్తచెదారం మొత్తం ఆ గూనల్లో ఇరుక్కుపోతున్నది. దీంతో చుట్టూ ఉన్న పంట పొలాల్లోని నీటితోపాటు ఎన్ఎస్పీ కాల్వ నీరు రోడ్డుపై నుంచి ప్రవహించడంతో రోడ్డు దెబ్బతింటున్నది. ప్రతి వర్షాకాలంలో ఈ రహదారి దెబ్బతినడంతో గంటవారిగూడెం, తెలగరామయ్య గూడెం గ్రామాల ప్రజలు నేరేడుచర్లకు రావడానికి ఇబ్బందులు పడడం పరిపాటిగా మారింది. ఈ రోడ్డు డ్యామేజీ కావడం వల్ల పెంచికల్ దిన్న నుంచి లేదా చిల్లేపల్లి మీదుగా తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి సిమెంట్ గూనల స్థానంలో కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ధ్వంసమైన నేరేడుచర్ల నుంచి గంటవారిగూడెం వెళ్లే రోడ్డు

జిట్టా బాలకృష్ణారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న నాయకులు, జనం

జిట్టాకు కన్నీటి వీడ్కోలు

తెలంగాణ ఉద్యమ కెరటం మరణంతో శోక సంద్రంలో భువనగిరి

- సందర్శనార్థం ఫామ్ హౌస్‌లో పార్థివ దేహం
- పలువురు నేతల నివాళి.. కుటుంబ సభ్యులకు ఓదార్పు
- మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి నివాళి
- కడసారి చూపుకోసం పెద్దఎత్తున తరలివచ్చిన జనం
- తీవ్ర ఉద్వేగానికి లోనైన బంధువులు, కుటుంబ సభ్యులు
- పాడె మోసిన చామల, రాజగోపాల్‌రెడ్డి, కుంభం, పైళ్ల శేఖర్ రెడ్డి
- పట్టణం మీదుగా బొమ్మాయిపల్లి వరకు అంతిమ యాత్ర



జిట్టా బాలకృష్ణారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి,నాయకులు గొంగిడి మహేందర్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డికి అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు పలికారు. శుక్రవారం ఉదయం మరణించిన తర్వాత హైదరాబాద్ నుంచి అంబులెన్స్‌లో భువనగిరి తీసుకొచ్చారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అభిమానులు, బంధువులు, కుటుంబ సభ్యుల సందర్శనార్థం ఆయన ఫామ్ హౌస్‌లో పార్థివ దేహాన్ని ఉంచారు. ఈ సందర్భంగా పలువురు ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిట్టా కుటుంబ సభ్యులను ఓదార్చారు. దాంతో జిట్టా ఫామ్‌హౌస్ పెద్ద ఎత్తున తరలివచ్చిన జనంతో నిడిపోయింది. ఎక్కడ చూసినా తండోపతండాలుగా వచ్చిన జనమే కనిపించారు. ఈ క్రమంలో బాలకృష్ణారెడ్డి అంతిమ యాత్రకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం తర్వాత ఆయన పార్థివ దేహాన్ని పూలతో అలంకరించి వైకుంఠ రథంపైకి చేర్చారు. పుష్పాంజలి ఘటించిన కుటుంబ సభ్యులు, అభిమానులు పార్థివదేహం ఫామ్‌హౌస్ నుంచి కదిలి వెళ్తుండగా ఒక్కసారిగా ఉద్వేగానికి లోనయ్యారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి జిట్టా పాడె మోశారు. అటు నుంచి అంతిమ యాత్ర ప్రారంభమై.. పట్టణం మీదుగా జిట్టా సొంతూరైన భువనగిరి మండలంలోని బొమ్మాయిపల్లి వరకు కొనసాగించారు. ఆయన అభిమానులు, నేతలు వాహనం ముందు నడిచారు. అనంతరం బొమ్మాయిపల్లి వైకుంఠ ధామంలో ఆయన అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. ఆయా మార్గాల్లో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అయ్యింది.

ఆవేదనలో అభిమానులు

జిట్టా మరణవార్తతో భువనగిరితో పాటు ఆలేరు నియోజకవర్గాల ప్రజలు శోక సంద్రంలో మునిగిపోయారు. అంతే కాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆవేదనకు గురయ్యారు. ఎక్కడ చూసినా జిట్టా మరణ వార్త గురించే చర్చించుకున్నారు. అందరినీ ప్రేమ, ఆప్యాయతలతో మాట్లాడే వ్యక్తి, మంచి గుణం ఉన్న ప్రజానేత మరణవార్తతో కంటనీరు పెట్టుకుంటున్నారు. భువనగిరికి ఆయన చేసిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. భువనగిరితోపాటు తెలంగాణ వ్యాప్తంగా జిట్టా ఉద్యమ ప్రస్తానం, పోరాటాన్ని నెమరువేసుకున్నారు.

కోమటిరెడ్డి, హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి నివాళి

జిట్టా బాలకృష్ణారెడ్డి పార్థివ దేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్ రెడ్డి వేర్వేరుగా జిట్టా పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీలు కోదండరాం, తీన్మార్ మల్లన్న, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి ఎలిమినేటి ఉమా మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిశోర్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, గొంగిడి మహేందర్ రెడ్డి, చెరుకు సుధాకర్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జిట్టా పార్థివ దేహానికి నివాళులర్పించారు.

సూర్యాపేటలో భారీ వర్షం

జిల్లాలో పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సూర్యాపేట పట్టణంలో భారీ వర్షం పడగా రోడ్లపై వరద నీరు నిలిచింది. ప్రయాణికులు, ప్రజలు కొంత ఇబ్బంది పడ్డారు.

సూర్యాపేట వాణిజ్య భవన్ వద్ద రోడ్డుపై పారుతున్న వరదనీరు

26 నుంచి ఎంజీయూ ఎంఈడీ, బీఈడీ సెమిస్టర్ పరీక్షలు

రామగిరి, సెప్టెంబర్ 6 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంఈడీ, బీఈడీ కళాశాలలో చదివే విద్యార్థులకు సెమిస్టర్-2 రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 26నుంచి అక్టోబర్ 7వరకు నిర్వహించనున్నట్లు సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. పరీక్షల షెడ్యూల్‌ను శుక్రవారం ఆయన ఎంజీయూలో విడుదల చేశారు. వర్సిటీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.